# రైతాంగానికి అన్యాయం చేస్తారా..?

- భద్రాద్రి జిల్లాలో ముగ్గురు మంత్రులు ఉండి రిజర్వాయర్లు లేకుండా చేస్తారా..?
- సాగునీటి సాధనకు మరో ఉద్యమం చేద్దాం : సిపిఎం


సదస్సులో మాట్లాడుతున్న సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు జూలకంటి రంగారెడ్డి,

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఉమ్మడి ఖమ్మం జిల్లాకు ముగ్గురు మంత్రులు ఉన్నప్పటికీ భద్రాద్రి జిల్లా రైతాంగానికి అన్యాయం చేస్తున్నారని మాజీ ఎమ్మెల్యే, సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు జూలకంటి రంగారెడ్డి, రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు పోతినేని సుదర్శన్‌రావు అన్నారు. శనివారం సిపిఎం ఖమ్మం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో సీతారామ ప్రాజెక్టు ద్వారా జిల్లా రైతాంగానికి సాగునీరు అందించాలని, పాత డిజైన్ ప్రకారం ప్రాజెక్టు నిర్మించాలని డిమాండ్ చేస్తూ కొత్తగూడెం పాతబస్ డిపో నుంచి పద్మశాలి కళ్యాణ మండపం వరకు వందలాది మందితో భారీ ప్రదర్శన నిర్వహించారు. అనంతరం పార్టీ జిల్లా కార్యదర్శి మచ్చ వెంకటేశ్వర్లు అధ్యక్షతన జరిగిన జిల్లా సదస్సులో జూలకంటి మాట్లాడారు. భద్రాద్రి జిల్లాలో రిజర్వాయర్లు లేకుండా చేస్తారా అని ప్రశ్నించారు. కేవలం కమీషన్ల కోసమే ప్రాజెక్టుల నిర్మాణాలు చేస్తున్నారే తప్పా, సాగు, తాగు నీటి కోసం కాదని అన్నారు. ప్రాజెక్టు కోసం సాగు భూములు ఇచ్చిన రైతులకే సాగునీరు ఇవ్వకుండా చేస్తారా అని ప్రశ్నించారు. ప్రాజెక్టు డిజైన్లు ఎవరి ప్రయోజనం కోసం మారుస్తున్నారని, మంత్రి భూముల కోసం జిల్లా రైతాంగానికి అన్యాయం చేస్తారా అని ఆగ్రహం వ్యక్తం చేశారు. డిజైన్ మార్చడం వల్ల జిల్లాలో నిర్మించాలనుకున్న రిజర్వాయర్లు లేకుండా పోయాయని, ఇది జిల్లా ప్రజలకు చేసిన తీవ్ర అన్యాయమని అన్నారు. జిల్లా రైతాంగం రాజకీయాలకతీతంగా పోరాటాలు చేయాలని పిలుపునిచ్చారు. ఈ విషయంలో రాష్ట్ర ముఖ్యమంత్రి స్పందించి పూర్తి స్థాయిలో విచారణ జరిపి పాత డిజైన్ ప్రకారం ప్రాజెక్టు నిర్మించాలని డిమాండ్ చేశారు.

పోతినేని మాట్లాడుతూ.. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాకు అన్యాయం జరుగుతుంటే జిల్లాలో ఉన్న ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎంపీలు స్పందించాలని డిమాండ్ చేశారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో గోదావరి జలాల సాధన కోసం సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు తమ్మినేని వీరభద్రం నాయకత్వంలో మహాప్రస్థానం పేరుతో వందరోజులు 2600 కి.మీ పాదయాత్ర చేశామని గుర్తుచేశారు. పోతినేని సుదర్శన్ నాయకత్వంలో మహారైతు పాదయాత్ర చేశామని తెలిపారు. తలాపునే గోదావరి పోతుంటే జిల్లా రైతులు సాగు నీరు లేక అవస్థలు పడుతున్నారని, సిపిఎం సాగునీటి ప్రాజెక్టుల కోసం పోరాటం చేసిందన్నారు. సీతారామ ప్రాజెక్టు వచ్చిందని సంతోషపడ్డ ప్రజలకు మిగిలింది విషాదమేనని అన్నారు. డిజైన్ మార్చి గోదావరి జలాలను తరలించుకుపోతుంటే చూస్తూ ఊరుకోవద్దని, సాగునీటి సాధనకు మరో ఉద్యమం చేద్దామని పిలుపునిచ్చారు. మచ్చా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. జిల్లాలో ఉన్న చెరువులన్నింటికీ సీతారామ ప్రాజెక్టు ద్వారా గోదావరి నీటి సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. ప్రాజెక్టు నిర్మాణం వెంటనే పూర్తి చేయాలని, డిస్ట్రిబ్యూటరీ కాల్వలను పూర్తి చేయాలని, జిల్లా రైతాంగానికి నీళ్లు ఇవ్వకుండా తరలిస్తే చూస్తూ ఊరుకోమని, జిల్లా వ్యాప్తంగా ఉద్యమం ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు అన్నవరపు కనకయ్య, ఏజే రమేష్, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎంబి నర్సారెడ్డి, కొక్కెరపాటి పుల్లయ్య, కారం పుల్లయ్య, లిక్కి బాలరాజు, అన్నవరపు సత్యనారాయణ, రేపాకుల శ్రీనివాస్, జిల్లా కమిటీ సభ్యులు కున్సోత్ ధర్మ, కొండపల్లి శ్రీధర్, ఎస్ఎ నబీ, గడ్డం స్వామి, నిమ్మల వెంకన్న, భూక్యా రమేష్, కొండబోయిన వెంకటేశ్వర్లు, ముదిగొండ రాంబాబు, యాసా నరేష్, సత్రపల్లి సాంబశివరావు, మోరంపూడీ శ్రీనివాసరావు, మండల కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.


సిఎస్‌కు వినతి పత్రం అందజేస్తున్న టిజిఒ సంఘం నేతలు

## ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి చొరవ చూపండి

- సిఎస్‌కు టిజిఒ వినతి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలో ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి చొరవ చూపాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి (సిఎస్) కె రామకృష్ణారావును టిజిఒ సంఘం కోరింది. ఈ మేరకు ఆయన్ను శనివారం హైదరాబాద్‌లోని సచివాలయంలో ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఏలూరి శ్రీనివాసరావు, ప్రధాన కార్యదర్శి ఎ సత్యనారాయణ నేతృత్వంలో కలిసి వినతిపత్రం అందజేశారు. 16 నెలలుగా సిఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క, మంత్రులు, అధికారులను కలిసినా ఒక్క అడుగు కూడా ముందుకు పడడంలేదని తెలిపారు. పెండింగ్‌లో ఉన్న ఐదు డిఎలను వెంటనే విడుదల చేయాలని కోరారు. పెండింగ్‌లో ఉన్న రూ.పది వేల కోట్ల బిల్లులను వెంటనే విడుదల చేయాలని సూచించారు. ఈనెలలోనే ఉద్యోగుల సాధారణ బదిలీలు చేపట్టాలని తెలిపారు. సమయానికి డిపిసి ఏర్పాటు చేసి ఉద్యోగోన్నతులను కల్పించాలని పేర్కొన్నారు. పిఆర్‌సి నివేదికను ప్రభుత్వం తెప్పించుకుని 51 శాతం ఫిట్‌మెంట్‌ను అమలు చేయాలని తెలిపారు. ఉద్యోగులకు ఆరోగ్య పథకాన్ని వెంటనే అమలు చేయాలని వివరించారు. 317 జీవో బాధితుల బదిలీల కోసం సూపర్‌న్యూమరరీ పోస్టులను సృష్టించి స్థానికత కోల్పోయిన ఉద్యోగులు, ఉపాధ్యాయులను వారి సొంత జిల్లా/జోన్‌కు కేటాయించాలని కోరారు. సీపీఎస్‌ను రద్దు చేసి ఓపీఎస్‌ను పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో టిజిఒ అసోసియేట్ అధ్యక్షులు బి శ్యామ్, కోశాధికారి ఎం ఉపేందర్‌రెడ్డి, నాయకులు నరహరి, దీపారెడ్డి, పరమేశ్వర్‌రెడ్డి, లక్ష్మణ్‌గౌడ్, శ్రీనివాసమూర్తి, వెంకటేశ్వర్లు, కృష్ణయాదవ్, కె రామారావు, వినోద్‌కుమార్, శ్రీనేష్‌కుమార్, నిరంజన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# 'పరిపూర్ణ ప్రేమతత్వం మూర్తీభవించిన ముసాఫిర్'

ప్రజాశక్తి కల్చరల్

ప్రపంచం లోని ప్రతి జీవిని ప్రేమించే జీసస్ బోధనను అకలింపు చేసుకున్న కవి విద్యాధర రావు అని శ్రీ వెంకటేశ్వర విశ్వవిద్యాలయం విశ్రాంత ఉపాధ్యక్షుడు ఆచార్య కొలకలూరి ఇనాక్ అన్నారు. పరిపూర్ణ ప్రేమ తత్వం మూర్తీభవించిన కావ్యం విద్యాధర రావు రచించిన ముసాఫిర్ అని ఆయన వివరించారు రవీంద్ర భారతి సమావేశ మందిరం లో విమల సాహితీ సమితి నిర్వాహణలో డాక్టర్ జల్ది విద్యాధర రావు రచించిన ముసాఫీర్ కవితా సంపుటి ఆవిష్కరణ సభ జరిగింది ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆచార్య ఇనాక్ సంపుటి ఆవిష్కరించి మాట్లాడారు కవిత్వం కన్న బిడ్డ విద్యాధర రావు అని అభివర్ణించారు స్త్రీ పట్ల అత్యంత అచంచల పవిత్ర శిల్ప సౌందర్యం కవితా వస్తువులలో వుందని



వివరించారు అధ్యక్షత వహించిన ప్రముఖ రచయిత డాక్టర్ బిక్కు కష్ణ మాట్లాడుతూ ముసాఫిర్ అంటే బాటసారి అని విద్యాధర రావు సమాజం ను బాటసారి లా వీక్షణ చేశారు అని ప్రశంసించారు కొలకలూరి ఫౌండేషన్ విద్యాధర రావు తో కలసి ప్రారంభించి ఏటా ముప్పై కవితా సంపుటి లకు అవార్డ్స్ బహుకరిస్తున్నామనీ తెలిపారు సంపుటిని సమీక్ష చేసిన తెలంగాణ రచయితల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ నాలేస్వరం శంకరం మాట్లాడుతూ యాంత్రిక జీవితం లో చచ్చి పోతున్న సమాజంను జీవించటం కోసం విద్యాధర రావు కవితల తో ఆవేదన వ్యక్తం చేస్తున్నారు అని వివరించారు రచయిత్రులు రోహిణి శైలజ మిత్ర డాక్టర్ రాధా కుసుమ,విజయ లక్ష్మి పండిత్ తదితరులు సంపుటిని లోని కవితలు సమీక్ష చేశారు అనంతరం కవి విద్యాధర రావు తన సంపుటిని లాంఛనం గా ఆచార్య ఇనాక్ కు అంకిత మిచ్చారు


ఆందోళన చేస్తున్న ఆర్‌టిసి కార్మికులు

## ఆర్‌టిసి కార్మికులను ప్రభుత్వంలో విలీనం చేయాలి

- పెండింగ్ సమస్యలు వెంటనే పరిష్కరించాలి
- తెలంగాణ ఆర్‌టిసి స్టాఫ్ అండ్ వర్కర్స్ యూనియన్ ప్రధాన కార్యదర్శి కె రాజిరెడ్డి
- చలో బస్ భవన్ కార్యక్రమం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఆర్‌టిసి కార్మికులను ప్రభుత్వంలో వెంటనే విలీనం చేయాలని, దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న కార్మికుల సమస్యలను పరిష్కరించాలని తెలంగాణ ఆర్‌టిసి స్టాఫ్ అండ్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె రాజిరెడ్డి డిమాండ్ చేశారు. ఆర్‌టిసి కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ శనివారం చలో బస్ భవన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా హైదరాబాద్‌లోని ఆర్‌టిసి క్రాస్ రోడ్స్ వద్ద గల బస్ భవన్ వద్ద జరిగిన సమావేశంలో ఐఎన్‌టీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్‌డీ చంద్రశేఖర్‌తో కలిసి ఆయన పాల్గొన్నారు. రాజిరెడ్డి మాట్లాడుతూ.. ఆర్‌టిసి కార్మికులపై రోజు రోజుకూ పెరుగుతున్న పని భారంతోపాటు సమస్యలపైనా పలు దఫాలుగా మెమొరాండం ఇచ్చినప్పటికీ యాజమాన్యం స్పందించడం లేదన్నారు. 2021 వేతన సవరణ ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా మాస్టర్ స్కేల్ ఇవ్వాలన్నారు. పే స్కేల్ జాప్యమైతే 25 శాతం ఐఆర్ ప్రకటించాలని డిమాండ్ చేశారు. ఆర్‌టిసిలో వెల్ఫేర్ కమిటీలను రద్దుచేసి ట్రేడ్ యూనియన్లను అనుమతించాలన్నారు. ఆర్‌టిసి కార్మికులను ప్రభుత్వంలో విలీనం చేసి అపాయింట్‌మెంట్ డేను వెంటనే ప్రకటించాలని కోరారు. కార్మికులకు సంపూర్ణ ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. విద్యుత్ బస్సుల పథకంలో మార్పులు చేసి ఆర్‌టిసినే కొనుగోలు చేసేందుకు సబ్సిడీ ఇచ్చే విధంగా కేంద్ర ప్రభుత్వానికి రాష్ట్ర ప్రభుత్వం తీర్మానం చేసి పంపాలని, కేంద్రంపై ఒత్తిడి తేవాలని కోరారు. హైకోర్టు ఆదేశాలను అమలు చేస్తూ ఆర్‌టిసిలో గుర్తింపు సంఘం ఎన్నికల నిర్వహించాలన్నారు. కండక్టర్లపై చిన్నచిన్న ఆరోపణలకు చర్యలు తీసుకుంటున్నారని, వారికి వెంటనే న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.

ఐఎన్‌టీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్‌డీ చంద్రశేఖర్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పెండింగ్ సమస్యలు ఒక్కొక్కటిగా పరిష్కరిస్తూ వస్తున్నదని తెలిపారు. అదేవిధంగా క్షేత్రస్థాయిలో ఆర్‌టిసి కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో స్టాఫ్ అండ్ వర్కర్స్ యూనియన్ ఉపాధ్యక్షులు అబ్రహం, ఆర్గనైజింగ్ జనరల్ సెక్రెటరీ డి గోపాల్, సాయి రెడ్డి, వినాయక్ రెడ్డి, విజయబాబు, నాయకులు, ఆర్‌టిసి కార్మికులు పాల్గొన్నారు.

## మిస్ వరల్డ్ పోటీల ఏర్పాట్లపై నివేదిక అందించండి

- అధికారులకు సిఎస్ ఆదేశం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

హైదరాబాద్‌లో ఈ నెల 7 నుంచి 30వ తేదీ వరకు జరగనున్న మిస్ వరల్డ్ పోటీల ఏర్పాట్లపై వెంటనే నివేదిక అందించాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణరావు అధికారులను ఆదేశించారు. ఇదే అంశంపై శనివారం హైదరాబాద్‌లోని సచివాలయం నుంచి పోలీసులు, ఇతర అధికారులతో ఆయన టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. ముఖ్యమంత్రి ఇటీవల నిర్వహించిన సమీక్షలో సూచించిన విధంగా ఏర్పాట్లు చేయాలని వారిని ఆదేశించారు. ప్రపంచం నలుమూలల నుంచి వచ్చే అతిథులకు అసౌకర్యం కలగకుండా అన్ని శాఖలు సమన్వయంతో పని చేయాలని సూచించారు. విమానాశ్రయం, హోటళ్లు, అంతర్జాతీయ కార్యక్రమాలు నిర్వహించే వేదికల వద్ద గట్టి భద్రత కల్పించాలని కోరారు. పోటీదారుల కోసం సవివరమైన బుక్‌లెట్‌ను సిద్ధం చేయాలని పర్యాటక శాఖ అధికారులను, కార్యక్రమాలు నిర్వహించే ప్రాంతాలను సుందరంగా తీర్చిదిద్దాలని జిహెచ్ఎంసి అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డిజిపి జితేందర్, ముఖ్యమంత్రి ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేష్ రంజన్, ఆరోగ్య శాఖ ముఖ్య కార్యదర్శి క్రిస్టినా చోంగ్తు, సమాచార పౌర సంబంధాల శాఖ కమిషనర్ వినయ్ కృష్ణారెడ్డి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

## ఐసెట్ దరఖాస్తు గడువు 10 వరకు పొడిగింపు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలో ఎంబిఎ, ఎంసిఎ కోర్సుల్లో 2025-26 విద్యా సంవత్సరంలో ప్రవేశాల కోసం నిర్వహించే ఐసెట్ దరఖాస్తు గడువును ఈ నెల పదో తేదీ వరకు ప్రభుత్వం పొడిగించింది. ఈ మేరకు ఐసెట్ కన్వీనర్ అలువాల రవి శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఆలస్య రుసుము లేకుండా దరఖాస్తుల సమర్పణ గడువును ఈ నెల పదో తేదీ వరకు పొడిగించామని తెలిపారు. ఇప్పటి వరకు 51,857 మంది అభ్యర్థులు దరఖాస్తు చేశారని వివరించారు. ఆసక్తి ఉన్న అభ్యర్థులు త్వరగా దరఖాస్తు చేయాలని సూచించారు. జూన్ ఎనిమిది, తొమ్మిది తేదీల్లో ఐసెట్ రాతపరీక్షలను ఆన్‌లైన్‌లో నిర్వహిస్తారు. ఇతర వివరాల కోసం మార్చి ఆరు నుంచి https://icet.tsche.ac.in వెబ్‌సైట్‌ను సంప్రదించాల్సి ఉంటుంది.

## 20న దేశవ్యాప్త సార్వత్రిక సమ్మె

### సిఎస్‌కు కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల నోటీసు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

దేశవ్యాప్త సార్వత్రిక సమ్మె ఈ నెల 20న జరగనున్న నేపథ్యంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావుకు సమ్మె నోటీసు ఇచ్చారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో సమ్మెకు పోవడానికి గల కారణాలు సంఘం నాయకులు ప్రధాన కార్యదర్శికి వివరించారు. 29 కార్మిక చట్టాలను రద్దు చేసి నాలుగు లేబర్‌కోడ్‌లుగా మార్చి అమలు చేసేందుకు బిజెపి సర్కారు ప్రయత్నిస్తున్నదని తెలిపారు. ఈ కోడ్‌లతో కార్మికుల హక్కులు హరించబడతాయన్నారు. జీతాల పెంపుదలకు కార్మికులకు బేరసారాల శక్తి బలహీనపడుతుందని తెలిపారు. ఉద్యోగ, ఉపాధికి గ్యారంటీ లేకుండా పోతుందని తెలియజేశారు. ఈ నేపథ్యంలో ఈ నెల 20న కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ కార్మికులు సమ్మెలోకి వెళుతున్నట్టు ప్రధాన కార్యదర్శికి వివరించారు. సమ్మె నోటీసు ఇచ్చినవారిలో ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షులు జె.వెంకటేష్, ప్రధానకార్యదర్శి జె కృష్ణారెడ్డి, ఉపాధ్యక్షురాలు పద్మశ్రీ, రాష్ట్ర కార్యదర్శి జె.కుమారస్వామి పాల్గొన్నారు.

## రాష్ట్ర ప్రభుత్వ ఒత్తిడితోనే కేంద్రం దిగొచ్చింది

- కులగణనపై ఎంపి మల్లు రవి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన కులగణన సర్వేను కేంద్ర ప్రభుత్వం మోడల్‌గా తీసుకోవాలంటూ సీడబ్ల్యూసీ సమావేశంలో తీర్మానం చేయడం హర్షణీయమని ఎంపీ మల్లు రవి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. దేశంలో ఎక్కడా లేని విధంగా సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రివర్గం చొరవతో కులగణన పారదర్శకంగా, పకడ్బందీగా, శాస్త్రీయంగా చేపట్టారని తెలిపారు. ఎలాంటి భేషజాలకు పోకుండా త్వరలో కేంద్ర ప్రభుత్వం చేపట్టబోయే కులగణన చేపట్టాలని డిమాండ్ చేశారు.

## బిజెపికి సామాజిక న్యాయం పట్టదు

- టిపిసిసి అధికార ప్రతినిధి చనగాని దయాకర్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

కేంద్రంలోని బిజెపి సర్కారుకు సామాజిక న్యాయం పట్టదని టిపిసిసి అధ్యక్షులు చనగాని దయాకర్ విమర్శించారు. ఆ పార్టీ ఏనాడూ సామాజిక న్యాయం గురించి మాట్లాడలేదని గుర్తు చేశారు. శనివారం హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో ఆయన విలేకర్లతో మాట్లాడారు. తెలంగాణలో కులగణనతోనే కేంద్రం దిగొచ్చిందని చెప్పారు. రాహుల్‌గాంధీ తెలంగాణలో జరిగిన కులగణనను పదేపదే ప్రస్తావించారని గుర్తు చేశారు. కులగణనతో బిజెపి కేంద్ర ప్రభుత్వానికి భయం పట్టుకుందని చెప్పారు. దేశ వ్యాప్తంగా మూడువేల కులాల నుంచి 25వేల ఉపకులాలు ఉన్నాయని తెలిపారు. జన, కులగణనపై కేంద్ర ప్రభుత్వం విధి,విధానాలను వెల్లడించాలని కోరారు. కులగణనపై కేంద్రం ప్రకటనలకే పరిమితం కావొద్దని ఆయన హెచ్చరించారు.

# రెండేళ్లలో 'దేవాదుల' పూర్తి

- 6 లక్షల ఎకరాలకు సాగునీరు
- సమ్మక్క బ్యారేజీకి 44 టిఎంసిలు కేటాయింపు
- నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి
- పూడిక పనులు జూన్ 15లోపు పూర్తి చేయాలి : మంత్రి పొంగులేటి


పనులను పరిశీలిస్తున్న మంత్రులు ఉత్తమ్ కుమార్, పొంగులేటి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రెండేండ్లలో దేవాదుల ప్రాజెక్టును పూర్తి చేసి ఆరు లక్షల ఎకరాలకు సాగునీరందిస్తామని నీటిపారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. శనివారం ఉమ్మడి వరంగల్ ఇన్‌చార్జి మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డితో కలిసి దేవన్నపేట పంప్‌హౌజ్, ధర్మసాగర్ రిజర్వాయర్ వద్ద పనులను పరిశీలించారు. అనంతరం హన్మకొండ జిల్లా కలెక్టరేట్‌లో నీటిపారుదల, పౌర సరఫరాల శాఖలపై సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ.. దేవాదుల ప్రాజెక్టును పూర్తి చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉందన్నారు. గత ప్రభుత్వం పదేండ్లలో రూ.1.81 లక్షల కోట్లు ఖర్చు పెట్టినా నామమాత్రపు ఆయకట్టును మాత్రమే పెంచగలిగిందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం తక్కువ సమయంలో తక్కువ ఖర్చుతో ఎక్కువ ఆయకట్టు సుమారు 5-6 లక్షల ఎకరాల ఆయకట్టుకు సాగునీరందిస్తున్నామని తెలిపారు. ఉమ్మడి వరంగల్ జిల్లాకు ఇప్పటికే మూడుసార్లు వచ్చామని, దేవాదుల ప్రాజెక్టుకు సంబంధించి భూ సేకరణ, ఇతర సమస్యలన్నింటినీ పరిష్కరించి రెండేండ్లలో పరిష్కరించి ప్రాజెక్టును పూర్తి చేసి ఉమ్మడి వరంగల్ జిల్లాతోపాటు యాదాద్రి జిల్లాకు సాగునీరందిస్తామన్నారు. గతంలో సమ్మక్క బ్యారేజీకి గోదావరి నది జలాల కేటాయింపులు జరగలేదని, రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాకే సమ్మక్క బ్యారేజీకి గోదావరి జలాలను 44 టీఎంసీల గోదావరి జలాలను కేటాయించినట్టు తెలిపారు. తద్వారా దేవాదుల ప్రాజెక్టు పరిధిలో తాగునీటికి సైతం ఈ జలాలను వినియోగించుకునే అవకాశం ఉంటుందన్నారు. గతంలో ఛత్తీస్‌గఢ్ నుంచి సమ్మక్క బ్యారేజీకి ఎన్‌ఓసీ ఇవ్వలేదని, తాజాగా ఆ రాష్ట్ర ముఖ్యమంత్రితో మాట్లాడి అంగీకారం పొందామన్నారు. రాష్ట్రంలో యేటా 280 లక్షల మెట్రిక్ టన్నుల సన్నధాన్యం పండుతున్నదని, ఈ మేరకు 8 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని ఫిలిప్పీన్స్ దేశానికి ఎగుమతి చేయడానికి ఒప్పందం చేసుకున్నట్టు తెలిపారు. ఆఫ్రికా దేశాలకు సైతం సన్న ధాన్యాన్ని ఎగుమతి చేయడానికి కృషి చేస్తున్నామన్నారు. 15 రోజులపాటు ధాన్యం కొనుగోళ్లపై దృష్టి సారించాల్సిందిగా మంత్రి ఎమ్మెల్యేలను కోరారు.

**'భద్రకాళి' పూడిక పనులు జూన్ 15 లోపు పూర్తి చేయాలి : మంత్రి పొంగులేటి**

భద్రకాళి చెరువు పూడిక పనులు జూన్ 15వ తేదీలోపు పూర్తి చేయాలని మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. ఇప్పటికే 50 శాతం పనులు పూర్తయ్యాయన్నారు. అసాధ్యమనుకున్న పనులను సాధ్యం చేయొచ్చని భద్రకాళి చెరువు పూడికతీత పనులను చేయడం ద్వారా రోల్ మోడల్‌గా నిలిచారని వరంగల్, హనుమకొండ జిల్లాల కలెక్టర్లు, నీటిపారుదల శాఖ, గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ అధికారులను మంత్రి అభినందించారు. ఈ సమీక్షా సమావేశంలో నీటిపారుదల శాఖ కార్యదర్శి ప్రశాంత్ జీవన్ పాటిల్, పౌరసరఫరాల శాఖ కార్యదర్శి డిఎస్ చౌహాన్, నీటిపారుదల శాఖ ఇఎన్‌సి సునీల్‌కుమార్, సీఈ అశోక్‌కుమార్, విప్ రామచంద్రునాయక్, మేయర్ గుండు సుధారాణి, ఎమ్మెల్సీ బస్వరాజ్ సారయ్య, ఎమ్మెల్యేలు కడియం శ్రీహరి, నాయిని రాజేందర్‌రెడ్డి, కేఆర్ నాగరాజు, యశస్వినీరెడ్డి, మురళీనాయక్, గండ్ర సత్యనారాయణరావు, కుడా చైర్మెన్ ఇనుగాల వెంకట్రాంరెడ్డి, వరంగల్, హన్మకొండ జిల్లా కలెక్టర్లు సత్యశారద, పి ప్రావీణ్య, జనగామ, భూపాలపల్లి, మహబూబాబాద్ జిల్లాల కలెక్టర్లు రిజ్వాన్ బాషా, రాహుల్ శర్మ, అద్వైత్‌కుమార్‌సింగ్ పాల్గొన్నారు.

## గ్లోబల్ మెడికల్ టూరిజం హబ్‌గా తెలంగాణ

- వైద్య పర్యాటక పటంలో ప్రత్యేక గుర్తింపు
- సిఎం సూచనతో మిస్ వరల్డ్ అభ్యర్థులకు అవగాహన

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

పపంచస్థాయి వైద్య సదుపాయాలు, సాంకేతికత, సామర్థ్యం కలిగిన వైద్యులు, ఉన్నత నాణ్యతైన చికిత్సలను అందిస్తూ ఇప్పటికే తెలంగాణ అంతర్జాతీయ రోగులను ఆకర్షిస్తుండగా, మిస్‌వరల్డ్ పోటీలతో ప్రపంచ వైద్య పర్యాటక పటంలో తెలంగాణ ప్రముఖ కేంద్రంగా మారనుంది. ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి మార్గదర్శకాల మేరకు 120 దేశాల ప్రతినిధులు హాజరయ్యే, 150కి పైగా దేశాల్లో ప్రత్యక్ష ప్రసారం అయ్యే మిస్ వరల్డ్ ఈవెంట్‌లో మెడికల్ టూరిజంను ప్రముఖంగా ప్రమోట్ చేసేందుకు అధికారులు ప్రత్యేక చొరవ చూపుతున్నారు.

**16న అవగాహన**

సిఎం రేవంత్‌రెడ్డి సూచనతో తెలంగాణలో తక్కువ ఖర్చుతో అందిస్తున్న అత్యాధునిక వైద్య సేవలను, మెడికల్ టూరిజంలో రాష్ట్రం సాధిస్తున్న ప్రగతిని తెలియజేసేలా మిస్ వరల్డ్ కాంటెస్టెంట్లలకు ఈ నెల 16వ తేదీన అవగహన కల్పించనున్నారు. హైదరాబాద్‌లోని ఏఐజీ హాస్పిటల్‌లో నిర్వహించే మెడికల్ టూరిజం ఈవెంట్‌ను ప్రత్యేకంగా అధికారులు నిర్వహిస్తున్నారు.

**ఖర్చు తక్కువ.... ప్రభావవంతమైన చికిత్సలు**

అమెరికా, యూరప్ వంటి దేశాలతో పోలిస్తే తెలంగాణలో చికిత్స ఖర్చులు 60 నుంచి 80 శాతం తక్కువ. దాదాపు శతాబ్ద కాలంగా వైద్య సేవలు అందిస్తున్న ఉస్మానియా ఆస్పత్రి, నిమ్స్, ఎంఎన్‌జే క్యాన్సర్ ఆసుపత్రి, అపోలో హాస్పిటల్స్, యాశోదా హాస్పిటల్స్, అపోలో కాంటినెంటల్ హాస్పిటల్స్ వంటి ప్రైవేట్ ఆసుపత్రులు అత్యాధునిక సాంకేతికత (రోబోటిక్ సర్జరీ, టెలిమెడిసిన్), మల్టీస్పెషాలిటీ కేంద్రాలతో....కార్డియాలజీ, ఆర్థోపెడిక్స్, క్యాన్సర్ చికిత్స, ట్రాన్స్‌ప్లాంటేషన్, కాస్మెటిక్ ప్లాస్టిక్ సర్జరీ, ఫెర్టిలిటీ చికిత్సలు, అవయవ మార్పిడి వంటి సంక్లిష్ట ప్రక్రియలకు నిపుణులైన వైద్యులతో సమర్థవంతమైన చికిత్స అందిస్తున్నారు.

ఇక, మెడికల్ చార్జీల కొస్తే, అమెరికా తదితర పాశ్చాత్య దేశాలలో హార్ట్ సర్జరీ, బై పాస్ సర్జరీ ఒక లక్ష డాలర్లు అవుతుండగా హైదరాబాద్‌లో మాత్రం కేవలం 5 వేల డాలర్ల నుండి 10 వేల డాలర్లు మాత్రమే ఖర్చవుతున్నాయి అదేవిధంగా, మోకాలు నీ రీప్లేస్ మెంట్ సర్జరీకి వెస్ట్రన్ దేశాల్లో 40 వేల నుంచి 60 వేల డాలర్లు అవుతుండగా, హైదరాబాద్‌లో మాత్రం ఐదు వేల డాలర్ల లోపే అవుతున్నాయి. డెంటల్ సమస్యలకు విదేశాలలో ఐదు వేల డాలర్లు అవుతుండగా మన దగ్గర వెయి డాలర్ల లోపే అవుతున్నాయి. అందుకే, విదేశాల నుంచి వైద్య అవసరాలకు పెద్ద సంఖ్యలో రోగులు హైదరాబాద్ వస్తున్నారు

**హెల్త్ టూరిస్ట్‌లను ఆకర్షిస్తున్న అంశాలివే**

తక్కువ ఖర్చుతో సమర్థవంతమైన చికిత్సలు, అత్యంత నైపుణ్యం కలిగిన వైద్యులు, నిపుణులు, కనీస నిరీక్షణ సమయాలు, ఇంగ్లీష్ మాట్లాడే సిబ్బంది, కమ్యూనికేషన్ సౌలభ్యం, ప్రభుత్వ మద్దతు వైద్య వీసా (ఇ-వీసా), స్నేహపూర్వక వాతావరణం, కనెక్టివిటీ, రాష్ట్ర ప్రభుత్వం మద్దతు ఫలితంగా అమెరికా, రష్యా, బ్రిటన్, ఆఫ్రికా, మధ్య ప్రాచ్యం నుంచి రోగులు ఎక్కువగా హైదరాబాద్‌కు వస్తున్నారు. దీనివల్ల తెలంగాణలో మెడికల్ టూరిజం శరవేగంగా అభివృద్ధి చెందుతున్నది.

**పెరుగుతున్న హెల్త్ టూరిస్టులు**

2014 సంవత్సరంలో 75,171 మంది విదేశీ విదేశీ హెల్త్ టూరిస్టులు వైద్య సేవలు పొందేందుకు హైదరాబాద్‌కి రాగా... 2024 సంవత్సరం వరకూ దశాబ్ద కాలంలో 1 లక్షా 55 వేల 313 మంది విదేశీయులు వచ్చారు.

## నేడే నీట్

- పకడ్బందీగా ఏర్పాట్లు చేసిన అధికారులు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఎంబిబిఎస్, బిడిఎస్ కోర్సుల్లో 2025-26 విద్యా సంవత్సరంలో ప్రవేశాల కోసం నిర్వహించే జాతీయ అర్హత ప్రవేశ పరీక్ష (నీట్) ఆదివారం జరగనుంది. నీట్ పరీక్షలను అత్యంత పకడ్బందీగా నిర్వహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాట్లు పూర్తి చేసింది. రాష్ట్రంలో నీట్ పరీక్ష నిర్వహణకు 190 కేంద్రాలను ఏర్పాటు చేశారు. మొత్తం 72,507 మంది అభ్యర్థులు ఈ పరీక్షలకు హాజరయ్యేందుకు దరఖాస్తు చేశారు. ఆదివారం ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 1.30 గంటలలోపు పరీక్షా కేంద్రాల్లోకి అభ్యర్థులకు అనుమతి ఉంటుంది. మధ్యాహ్నం రెండు గంటల నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు ఈ పరీక్ష జరుగుతుంది. ఏ విధమైన అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా, పరీక్షను ప్రశాంతంగా నిర్వహించడానికి అధికారులు చర్యలు చేపట్టారు. పరీక్ష కేంద్రాల వద్ద విస్తృత బందోబస్తు ఏర్పాటు చేశారు. నీట్ పరీక్షా కేంద్రాల వద్ద మూడంచెల భద్రత ఉన్నది. పరీక్షకు హాజరయ్యే అభ్యర్థుల బయోమెట్రిక్ హాజరు విధానం ఉంటుంది. పరీక్షా కేంద్రాలకు సకాలంలో చేరుకోవాలని అధికారులు సూచించారు. నీట్ పరీక్షకు హైదరాబాద్ జిల్లాలో అత్యధికంగా 62 పరీక్షా కేంద్రాలున్నాయి. వాటిలో 26 వేల మంది అభ్యర్థులు పరీక్షలకు హాజరవుతారు.

## నేటితో ముగియనున్న ఎప్‌సెట్ ఇంజనీరింగ్ పరీక్షలు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలో ఇంజనీరింగ్, అగ్రికల్చర్, ఫార్మసీ కోర్సుల్లో 2025-26 విద్యా సంవత్సరంలో ప్రవేశాల కోసం ఆన్‌లైన్‌లో నిర్వహించే ఎప్‌సెట్ ఇంజనీరింగ్ విభాగం రాత పరీక్షలు ఆదివారంతో ముగుస్తాయి. ఈ మేరకు ఎప్‌సెట్ కన్వీనర్ బి డీన్‌కుమార్, కోకన్వీనర్ విజయ్‌కుమార్‌రెడ్డి శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. శనివారం ఉదయం మొదటి విడతకు 36,892 మంది దరఖాస్తు చేయగా, 34,607 (93.81 శాతం) మంది అభ్యర్థులు హాజరయ్యారని తెలిపారు. 2,285 (6.19 శాతం) మంది గైర్హాజరయ్యారని పేర్కొన్నారు. మధ్యాహ్నం రెండో విడతకు 36,885 మంది దరఖాస్తు చేస్తే 34,620 (93.86 శాతం) మంది అభ్యర్థులు పరీక్ష రాశారని వివరించారు. 2,265 (6.14 శాతం) మంది పరీక్షకు హాజరు కాలేదని తెలిపారు. ఈ పరీక్షలను ఉన్నత విద్యామండలి చైర్మన్ వి బాలకిష్టారెడ్డి, కార్యదర్శి శ్రీరాం వెంకటేష్, జెఎన్‌టియు హైదరాబాద్ విసి టి కిషన్‌కుమార్‌రెడ్డి, రిజిస్ట్రార్ కె వెంకటేశ్వరరావు పర్యవేక్షించారని వివరించారు.

## ప్రపంచ సుందరి పోటీలకు కట్టుదిట్టమైన భద్రత

- డిజిపి జితేందర్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ప్రపంచ సుందరి పోటీలకు కట్టుదిట్టమైన ఏర్పాట్లను చేస్తున్నామనీ, ఇందుకు రాష్ట్రంలోని పోలీసు అధికారులందరూ గట్టిగా కృషి చేయాలని డిజిపి జితేందర్ ఆదేశించారు. రాష్ట్రంలో నకిలీ విత్తనాల వ్యాపారాన్ని సాగిస్తున్న వారిపై ఉక్కుపాదం మోపాలని ఆయన అన్నారు. రాష్ట్రంలోని ఇన్‌స్పెక్టర్లతో డిజిపి శనివారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి పలు ఆదేశాలిచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ నెల 7 నుంచి 31వ తేదీ వరకు ప్రపంచ సుందరి పోటీలను రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాకరంగా నిర్వహిస్తోందనీ, ఈ సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా నిఘా వ్యవస్థను పటిష్టం చేయడంతోపాటు భద్రతను కట్టుదిట్టం చేయాలని ఆయన కోరారు. ఇందుకు అవసరమైన వ్యూహాలను ఇప్పటి నుంచే రూపొందించుకోవాలని ఆయన తెలిపారు. రాష్ట్ర పోలీసులకు దేశంలోనే ప్రతిష్టాకరమైన అవార్డులు రావటంతో ఏ మాత్రం నిర్లక్ష్యంగా కూడా వ్యవహరించరాదని ఆయన అధికారులను హెచ్చరించారు. ప్రజాసమస్యలపై నిష్పాక్షికంగా వ్యవహరించినపుడే వారికి పోలీసులపై మరింతగా నమ్మకం ఏర్పడుతుందని ఆయన అన్నారు. పోలీసు ఫ్రెండ్లీ విధానాన్ని అమలు చేయటం ద్వారా అమెరికా, ఇంగ్లాండ్ వంటి దేశాల్లో ఆ వ్యవస్థ పట్ల సంపూర్ణ విశ్వాసం ఏర్పడిందనీ, ఆ పరిస్థితిని మన వద్ద కూడా తీసుకురావాల్సిన అవసరం ఉన్నదని డీజీపీ అన్నారు.

# దేశం గర్వించే విధంగా 'యంగ్ ఇండియా' స్కూల్స్

- 105 స్కూల్స్ నిర్మాణానికి రూ.21 వేల కోట్లు మంజూరు
- అద్భుతమైన మేధస్సుతో సమాజానికి మానవ వనరులు అందించాలన్నదే ఉద్దేశం
- డిప్యూటీ సిఎం మల్లు భట్టి విక్రమార్క

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

దేశం గర్వించే స్థాయిలో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్‌ను రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేస్తున్నదని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అన్నారు. రాష్ట్రంలో 105 ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్ ఏర్పాటు కోసం రాష్ట్ర ప్రభుత్వం రూ.21 వేల కోట్లు మంజూరు చేసిందని వెల్లడించారు. ఖమ్మం జిల్లా బోనకల్ మండలం లక్ష్మీపురం గ్రామంలో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ భవన నిర్మాణానికి శనివారం భూమి పూజ చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. అద్భుతమైన మేధస్సుతో సమాజానికి మానవ వనరులను అందించాలన్నదే ఈ స్కూల్స్ ఉద్దేశం అని అన్నారు. సానపట్టిన వజ్రాల్లాగా తయారుచేసి ప్రపంచానికి జ్ఞానాన్ని అందించేలా స్కూల్స్‌ని డిజైన్ చేస్తామని తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా ప్రజల నుంచి పెద్ద ఎత్తున డిమాండ్ రావడంతో పిల్లల భవిష్యత్తే తమ బాధ్యతగా భావించి.. అదనంగా మరో 47 యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్‌ను రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేసేందుకు నిర్ణయించినట్టు చెప్పారు. ఈ పాఠశాలల్లో ఇంగ్లీష్ మీడియంలో అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన విద్యను అందించడంతో పాటు విద్యార్థులకు క్రికెట్, ఫుట్‌బాల్ అవుట్‌డోర్, ఇండోర్ ఆటలకు సంబంధించి క్రీడా ప్రాంగణాలు ఉండే విధంగా దాదాపు 25 ఎకరాల్లో డిజైన్ చేశామన్నారు. విద్యార్థులతో పాటు టీచింగ్ స్టాఫ్ ఉండే విధంగా వసతి గృహాలు ఏర్పాటు చేస్తున్నట్టు చెప్పారు. డిజిటల్ క్లాస్ రూమ్‌లు, యాంపీ థియేటర్, సైన్స్, మ్యాథమెటిక్స్ సబ్జెక్టులను అంతర్జాతీయ ప్రమాణాలతో విద్యాబోధన చేసే అధ్యాపక బృందాన్ని నియమిస్తామన్నారు. ఈ పాఠశాలలో చేరిన విద్యార్థులు 12వ తరగతి వరకు ఇందులోనే చదివి సానపట్టిన వజ్రాల్లాగా తయారవుతారని అన్నారు. విద్యార్థులకు పోషకాహారంతో కూడిన డైట్‌నూ అందించనున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.



శంకుస్థాపన చేస్తున్న డిప్యూటీ సిఎం భట్టి

## ఫ్యూచర్ సిటీలో "ఈ-సిటీ"

- వేయి ఎకరాల్లో ప్రత్యేకంగా అభివృద్ధి
- రాష్ట్ర ఐటి, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఏర్పాటు చేస్తున్న "ఫ్యూచర్ సిటీ"లో వేయి ఎకరాల్లో "ఎలక్ట్రానిక్ సిటీ (ఈ సిటీ)ని అభివృద్ధి చేయనున్నట్టు రాష్ట్ర ఐటి, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు తెలిపారు. ఇందులో రూ.300 కోట్లు పెట్టుబడి పెట్టేందుకు ముందుకొచ్చిన టెలికాం ఉత్పత్తుల సంస్థలైన సిరా నెట్ వర్క్స్ (తైవాన్), ఎల్ సీజీసీ రెజల్యూట్ గ్రూప్ (తెలంగాణ) ప్రతినిధులతో ఆయన శనివారం సచివాలయంలో సమావేశమయ్యారు. ఎలక్ట్రానిక్ పరిశ్రమల ఏర్పాటును ప్రోత్సహించేందుకు ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను ఈ సందర్భంగా మంత్రి వారికి వివరించారు. పరిశ్రమల ఏర్పాటులో పారిశ్రామికవేత్తలకు ఇబ్బందులు కలగకుండా సంబంధిత అధికారులతో ప్రత్యేక టాస్క్ ఫోర్స్‌ను ఏర్పాటు చేస్తామని చెప్పారు. టైర్-2, టైర్-3 నగరాలు, పట్టణాల్లో పరిశ్రమలు ఏర్పాటు చేసేందుకు ముందుకొచ్చే పారిశ్రామికవేత్తలకు ప్రత్యేక ప్రోత్సాహకాలిస్తామని తెలిపారు. ఈ పరిశ్రమ ద్వారా 2,500 మందికి ఉద్యోగాలు లభిస్తాయని చెప్పారు. ఇందులో 5జీ నెట్ వర్క్, మల్టీ లేయర్ నెట్వర్కింగ్ సొల్యూషన్స్, సర్వర్స్ తదితర టెలికాం ఉత్పత్తులను తయారు చేస్తారని వివరించారు. ఈ వ్యాపారం భాగస్వామ్యం ద్వారా ఇండో తైవాన్ మధ్య సత్సంబంధాలు మరింత బలోపేతమవుతాయని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో టిజిఐసిసి సిఇఒ మధుసూదన్, టి ఫైబర్ ఎండి వేణు ప్రసాద్, సిరా నెట్వర్క్స్ ప్రతినిధులు చయాన్, జాయ్ భట్టాచార్య, డౌగియాస్, ఎల్ సిజిసి రెజల్యూట్ గ్రూప్ నుంచి రణ్వీందర్ సింగ్, గీతాంజలి సభర్వాల్ తదితరులు పాల్గొన్నారు.



సంక్షేమ శాఖ డైరెక్టర్ కార్యాలయంలో డైరెక్టర్‌కు వినతి పత్రం అందజేస్తున్న అడివయ్య తదితరులు

## వికలాంగులకు సామాజిక భద్రత కల్పించాలి

- మే 13న వికలాంగుల సంక్షేమ శాఖ డైరెక్టర్ కార్యాలయం ముట్టడి
- ఎన్‌పిఆర్‌డి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అడివయ్య

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

వికలాంగులకు సామాజిక భద్రత కల్పించాలని, సంక్షేమానికి ప్రత్యేకంగా వికలాంగుల కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని ఎన్‌పీఆర్‌డీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.అడివయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో వికలాంగులు ఎదుర్కొంటున్న 48 రకాల సమస్యలపై హైదరాబాద్ మలక్‌పేట్‌లోని వికలాంగుల సంక్షేమ శాఖ డైరెక్టర్ కార్యాలయంలో డైరెక్టర్‌కు శనివారం ఎన్‌పిఆర్‌డి రాష్ట్ర కోశాధికారి ఆర్ వెంకటేష్, ఉపాధ్యక్షులు జె రాజు, రాష్ట్ర కమిటీ సభ్యులు పి.శశికళతో కూడిన ప్రతినిధి బృందం వినతిపత్రం అందజేసింది. ఈ సందర్భంగా అడివయ్య మాట్లాడుతూ.. రాష్ట్రంలో 43.02 లక్షల మంది వికలాంగులున్నారని తెలిపారు. 2014లో రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన సమగ్ర కుటుంబ సర్వే ప్రకారం 10.48 లక్షల మంది ఉంటే 4,90,044 మందికే పింఛన్ వస్తోందని తెలిపారు. 2016 ఆర్‌పీడబ్ల్యూడీ చట్టం, 2017 మెంటల్ హెల్త్ కేర్ యాక్ట్ పూర్తి స్థాయిలో అమలు కావడం లేదన్నారు. మహిళా వికలాంగులపై లైంగికదాడులు, వేధింపులు, వికలాంగులపై దాడులు, వేధింపులు పెరిగిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. వైకల్యం కలిగిన విద్యార్థుల కోసం ప్రత్యేక విద్యాసంస్థలు లేకపోవడం వల్ల ఉన్నత చదువులకు వారు దూరమవుతున్నారన్నారు. సమస్యల పరిష్కారానికి మే 13న డైరెక్టర్ కార్యాలయాన్ని ముట్టడిస్తామని చెప్పారు.

ప్రభుత్వ శాఖల్లో ఖాళీగా ఉన్న వికలాంగుల బ్యాక్‌లాగ్ పోస్టులను భర్తీ చేయడానికి ప్రత్యేక నోటిఫికేషన్ జారీ చేయాలని డిమాండ్ చేశారు. వికలాంగుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం చొరవ చూపాలని డిమాండ్ చేశారు.

## శ్రమ దోపిడీ అంతం.. సిఐటియు పంతం

- కార్మిక హక్కుల కోసం ఐక్య పోరాటానికి పిలుపు : చుక్క రాములు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

"శ్రమ దోపిడీ అంతం, సిఐటియు పంతం" అనే నినాదంతో కార్మికుల హక్కుల కోసం సిఐటియు నిరంతరం పోరాడుతుందని ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షులు చుక్క రాములు తెలిపారు. సమస్యల పరిష్కారానికి ఐక్య పోరాటాలే ఏకైక మార్గమని, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వివక్షపూరిత విధానాలను ఎదిరించాలని కార్మికులకు పిలుపునిచ్చారు. శనివారం మెదక్ జిల్లా రామాయంపేటలోని మెహర్ సాయి ఫంక్షన్ హాల్‌లో జరిగిన సిఐటియు 15వ మహాసభలో ఆయన మాట్లాడారు. కార్మికులు కట్టుబానిసలు కాదని, దేశ సంపదను సృష్టించే కష్టజీవులని అన్నారు. అయినప్పటికీ కేంద్ర ప్రభుత్వం 29 రకాల కార్మిక చట్టాలను రద్దు చేసి వారి బతుకులకు ఉరితాడు బిగించిందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో ఈ నెల 20న దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెకు కార్మిక లోకం సన్నద్ధమవుతోందని తెలిరు. దేశంలో మత విభజనతో కాలం వెళ్లదీసే పరిస్థితి నెలకొన్నదని, 400 సీట్లు ఇస్తే రాజ్యాంగాన్ని మార్చి, మనుధర్మ శాస్త్రాన్ని ముందుకు తెచ్చే ఆలోచన బీజేపీ ప్రభుత్వం చేసిందని ఆరోపించారు. ప్రధాని నరేంద్ర మోడీ పెట్టుబడిదారులపై పక్షపాతంతో అసంఘటిత కార్మికుల హక్కులను కాలరాస్తున్నారని విమర్శించారు. గతంలో ఉన్న బీఆర్ఎస్ ప్రభుత్వానికి ఏమాత్రం తగ్గకుండా.. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం కార్మిక వ్యతిరేక విధానాలకు పాల్పడుతున్నదని అన్నారు. కార్మికులు పనులు ఆపితే ఉత్పత్తి తగ్గి ప్రభుత్వ ఆదాయం కుంటుపడుతుందని, అయినా వారి కష్టాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విస్మరిస్తున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించకపోవడం అప్రజాస్వామిక చర్యగా ఖండించారు. నేడు జరిగే ర్యాలీ, బహిరంగసభలో కార్మికులు పెద్దఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షులు మల్లికార్జున్, జిల్లా అధ్యక్షులు మహేందర్ రెడ్డి, ఉపాధ్యక్షులు బాలమణి, ఎ. మల్లేశం, కె. నర్సమ్మ, సహాయ కార్యదర్శులు సంతోష్, కె.మల్లేశం పలు రంగాల కార్మికులు పాల్గొన్నారు.




మహాసభలో మాట్లాడుతున్న చుక్క రాములు

## ఈ ఏడాది 4.5 లక్షల ఇందిరమ్మ ఇళ్లు

- రూ.22 వేల కోట్లతో నిర్మాణం
- అసిస్టెంట్ ఇంజనీర్లకు సర్టిఫికెట్ల పంపిణీలో మంత్రి పొంగులేటి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలో పేదల సొంతింటి కల నెరవేరుస్తున్నామని గృహనిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. ఇంటి కోసం రూ.5 లక్షలతో ఏడాదికి నాలుగున్నర లక్షల ఇళ్లు నిర్మిస్తున్నట్టు చెప్పారు. గృహనిర్మాణ కార్పొరేషన్‌లో అవుట్‌సోర్సింగ్‌లో నియామకమైన 350 మంది అసిస్టెంట్ ఇంజనీర్లు ఆరు రోజులపాటు హైదరాబాద్‌లోని నేషనల్ అకాడమీ ఆఫ్ కన్‌స్ట్రక్షన్ (న్యాక్)లో శిక్షణ పొందారు. శనివారం ఇంజనీర్లకు మంత్రి సర్టిఫికేట్లు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదలు ఆత్మగౌరవంతో బతకాలన్న సంకల్పంతోనే సిఎం రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలో ఇందిరమ్మ ఇళ్ల పథకానికి రాష్ట్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టిందని చెప్పారు. ఈ ఏడాది రూ.22 వేల కోట్లతో 4.50 లక్షల ఇందిరమ్మ ఇళ్లు నిర్మించబోతున్నామనీ, ఇందుకు సంబంధించి మరికొద్ది రోజుల్లో లబ్దిదారుల ఎంపిక ప్రక్రియ పూర్తి చేస్తామన్నారు. ఇప్పటికే పైలట్ ప్రాజెక్టు గ్రామాల్లో ఇళ్ల నిర్మాణాలు చురుగ్గా సాగుతున్నాయని వెల్లడించారు. ప్రభుత్వ ఆలోచనలకనుగుణంగా అవినీతికి ఆస్కారం లేకుండా నిజాయితీ, నిబద్ధతతో పని చేసి పేదవారి చిరకాల కోరిక నెరవేరుస్తున్నట్టు తెలిపారు. ఇందిరమ్మ ఇండ్ల పథకంలో భాగస్వాములు కావాలని అసిస్టెంట్ ఇంజనీర్లకు ఆయన విజ్ఞప్తి చేశారు. ఎంపికైన 350 మంది ఇంజనీర్లలో 45 శాతం మహిళలే ఉండటం సంతోషించదగ్గ విషయమన్నారు. ఎన్ని ఒత్తిళ్లు వచ్చినా కూడా మెరిట్ పద్ధతిలోనే ఎంపిక చేయడం జరిగిందని తెలిపారు. ఇండ్ల పథకాల్లో కూడా కేంద్రం ఇస్తున్న నిధులతోనే అన్ని రాష్ట్రాలు సరిపెడుతున్నాయన్నారు. కానీ తెలంగాణ రాష్ట్రంలో పేదల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకుని ఇందిరమ్మ ప్రభుత్వం రూ.ఐదు లక్షలతో 400 చదరపు అడుగులకు తగ్గకుండా ఇళ్లను లబ్దిదారుడే నిర్మించుకునేలా పథకాన్ని రూపొందించిందని చెప్పారు. ఇందిరమ్మ ఇళ్ల కోసం కొద్ది రోజుల్లోనే నాలుగు లక్షల మంది జాబితా సిద్ధం చేయబోతున్నామని తెలిపారు. విధుల్లో చేరిన వెంటనే అసిస్టెంట్ ఇంజనీర్లు ఈ జాబితాలపై దృష్టి సారించాలని సూచించారు. ఎలాంటి ప్రలోభాలు, ఒత్తిళ్లకు గురికాకుండా అర్హులకే ఇందిరమ్మ ఇళ్లు అందేలా క్షేత్రస్థాయిలో పని చేయాలని కోరారు.

ఇందిరమ్మ ఇళ్లు పూర్తయిన వెంటనే దశలవారీ చెల్లింపుల్లో ఎలాంటి మధ్యవర్తుల ప్రమేయానికి ఆస్కారం లేకుండా చూడాలన్నారు. అందుకు అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగిస్తున్నామని చెప్పారు. వివిధ దశల్లో నిర్మాణం పూర్తి చేసుకున్న లబ్దిదారులకు ప్రతి సోమవారం చెల్లింపులు చేస్తున్నట్టు వివరించారు. నిర్మాణ రంగంలో తనకు ఉన్న అనుభవంతో తక్కువ ఖర్చు, నాణ్యతతో ఇండ్లను నిర్మించేందుకు అధికారులకు పలు సూచనలు చేసినట్టు గుర్తు చేశారు. అనంతరం స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖలో 21 మందికి ప్రభుత్వం పదోన్నతులు కల్పించిందని తెలిపారు. గ్రేడ్-2లో పని చేస్తున్న 10 మంది సబ్ రిజిస్ట్రార్లను గ్రేడ్-1కు సీనియర్ సహాయకులు పని చేస్తున్న 11 మందికి గ్రేడ్-2 పదోన్నతులు కల్పించామని తెలిపారు.

## ధాన్యం కొనుగోళ్లలో వేగం పెంచాలి

- బస్తాలు, లారీల కొరత లేకుండా చూడాలి
- సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు మల్లు లక్ష్మి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఐకెపి కేంద్రాల్లో ధాన్యం కొనుగోళ్లను వేగవంతం చేయాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు మల్లు లక్ష్మి ప్రభుత్వాన్ని కోరారు. సూర్యాపేట జిల్లా ఆత్మకూరు(ఎస్) మండలం నెమ్మికల్ గ్రామంలో ఐకెపి కేంద్రాన్ని శనివారం సిపిఎం నేతలతో కలిసి ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఐకేపీ కేంద్రాల్లో నెల రోజుల నుంచి ధాన్యం రాశులు పోసి కాంటాల కోసం రైతులు ఎదురుచూస్తున్నా.. కాంటాలు వేసే పరిస్థితి లేదన్నారు. వాతావరణంలో వస్తున్న మార్పుల మూలంగా అకాల వర్షాలు పడి చేతికొచ్చిన పంట తడిసి ముద్దయితే తీవ్రంగా నష్టపోయే ప్రమాదం ఉందన్నారు. ఆరుగాలం కష్టపడి పండించిన పంటను ఐకేపీ కేంద్రాల్లో కాంటాలు వేయడంలో జాప్యం వల్ల రైతులు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. గన్నీ బ్యాగుల కొరత తీవ్రంగా ఉందన్నారు. గన్నీ బ్యాగులు సప్లై చేయాలని జిల్లా స్థాయి అధికారులను అడిగితే ఐకేపీ కేంద్రాలకు సరిపడా బస్తాలు ఉన్నాయని, ముందస్తుగానే సరఫరా చేస్తున్నామని చెబుతున్న మాటలకు ఆచరణకు పొంతన లేదని విమర్శించారు. ఐకేపీ కేంద్రంలో గన్నీ బ్యాగుల కొరత, లారీల కేటాయింపు లేక కాంటాల కోసం రైతులు ఎదురు చూస్తున్నారని చెప్పారు. కాంటాలు వేసిన ధాన్యం మిల్లు దగ్గరికి వెళితే అన్‌లోడింగ్‌కు వారం రోజులు పడుతుండటంతో రైతుల బాధ వర్ణనాతీతంగా ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. ధాన్యం లోడు దిగుమతి చేసుకునేటప్పుడు మిల్లర్లు కొర్రీలు పెడుతూ తరుగు పేరుతో రైతులకు నష్టం కలగజేస్తున్నారని వివరించారు. మిల్లుల, లారీల కేటాయింపు, బస్తాల సరఫరాలో అధికారులు నిర్లక్ష్యం చేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కోట గోపి, రైతుసంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి దండావెంకటరెడ్డి, సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు జె.నర్సింహారావు, మండల కార్యదర్శి అవిరే అప్పయ్య, నాయకులు మూల విజయరెడ్డి, గోలి భాగ్యమ్మ, రేణిగుంట్ల రవి, రైతులు కాసర్ల మల్లారెడ్డి, బ్రహ్మాచారి, మదనాచారి, కొడిదల శ్రీను పాల్గొన్నారు.



ధాన్యాన్ని పరిశీలిస్తున్న మల్లు లక్ష్మి తదితరులు

## 'రంగనాయక సాగర్'లో నీట మునిగి ఇద్దరు మృతి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

సిద్దిపేట జిల్లా చిన్నకోడూరు మండలం రంగనాయకసాగర్ రిజర్వాయర్ వద్ద శనివారం విషాదఛాయలు అలుముకున్నాయి. రిజర్వాయర్‌ను చూడటానికి వరంగల్ నుంచి కుటుంబాలతో కలిసి వచ్చిన ఓ బాలిక, బాలుడు.. రిజర్వాయర్‌లో ఈత కొడుతుతుండగా ప్రమాదవశాత్తు నీట మునిగి మృతి చెందారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. వరంగల్ జిల్లాకు చెందిన యాకుబ్ బాబా, యజాజి ఆలీ కుటుంబాలు హైదరాబాద్‌కు వెళ్తూ మార్గమధ్యలో ఉన్న రంగనాయక సాగర్‌ను చూడటానికి వచ్చారు. ఈ క్రమంలో రిజర్వాయర్‌లో ఈత కొడుతుండగా యాకుబ్ బాబా కూతురు మెహరాజ్ (13), యజాజి అలీ కొడుకు అర్బాజ్ (15) ప్రమాదవశాత్తు నీటిలో మునిగి గల్లంతయ్యారు. విషయం తెలుసు కున్న పోలీసు, ఫైర్ సిబ్బంది గజ ఈతగాళ్ల సాయంతో వారి మృతదేహాలను వెలికి తీశారు. విషయం తెలుసుకున్న సిద్దిపేట ఎసిపి మధు, జిల్లా ఫైర్ ఆఫీసర్ సదన్ సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. సెల్ఫీల కోసం ఎవరూ నీటిలోకి దిగొద్దని.. ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని, తగు జాగ్రత్త తీసుకోవాలని కోరారు.

## ఉపాధి కార్మికుడు మృతి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఉపాధి కార్మికుడు మృతి చెందిన ఘటన కామారెడ్డి జిల్లా మహమ్మద్‌నగర్ మండలంలోని దూప్‌సింగ్ తండాలో జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. దూప్‌సింగ్ తండాకు చెందిన నర్ల నాయక్ (55) రోజువారీగా శుక్రవారం సైతం ఉపాధి హామీ పనికి వెళ్లాడు. పనివద్దనే వాంతులవడంతో ఉపాధి సిబ్బంది గమనించి ఇంటికి పంపించారు. వెంటనే కుటుంబ సభ్యులు బాన్సువాడ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన చికిత్స కోసం నిజామాబాద్ జిల్లా ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి శనివారం మృతి చెందారు. ఈ విషయంపై వైద్యాధికారులకు సంప్రదించగా మృతిచెందిన వ్యక్తి రిపోర్టులను పరిశీలించి ధృవీకరిస్తామని వెల్లడించారు.

## ఆర్థిక ఇబ్బందులతో దంపతులు ఆత్మహత్యాయత్నం

- భార్య మృతి, చికిత్స పొందుతున్న భర్త

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఆర్థిక ఇబ్బందులు, అనారోగ్య సమస్యలతో భార్యాభర్తలు ఆత్మహత్యయత్నం చేయగా.. భార్య మృతిచెందింది. భర్త చికిత్స పొందుతున్న ఘటన రంగారెడ్డి జిల్లా రాజేంద్రనగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో శనివారం జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. ఎర్రబోడ ప్రాంతానికి చెందిన రమేశ్, రాజేశ్వరి (38) భార్యాభర్తలు. రమేశ్ స్థానికంగా లేబర్ పని చేస్తూ జీవనం కొనసాగిస్తున్నాడు. ఇటీవల భార్యాభర్తలు అనారోగ్యం బారినపడటంతో పాటు ఆర్థిక ఇబ్బందులు తలెత్తాయి. దాంతో మనస్తాపం చెందిన వారు ఇంట్లో బాత్‌రూమ్ కడిగే యాసిడ్‌ను శనివారం ఇద్దరూ తాగారు. గమనించిన స్థానికులు వెంటనే సమీపంలోని ఆస్పత్రికి తరలించారు. రాజేశ్వరి కడుపులో పేగులు కాలిపోవడంతో ఆమె మృతి చెందారు. రమేష్ చికిత్స పొందుతున్నాడు. ప్రస్తుతం అతని పరిస్థితి నిలకడగా ఉందని వైద్యులు తెలిపారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## 20 రోజులైనా పడిగాపులే..

- ధాన్యం కొనుగోలు చేయాలని సిపిఎం రాస్తారోకో
- ఖమ్మం జిల్లాలో పలు మార్కెట్ యార్డులను సందర్శించిన సిపిఎం బృందం
- అకాల వర్షాలతో ధాన్యం వర్షార్పణం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

కొనుగోలు కేంద్రాలకు వచ్చిన ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేయాలని డిమాండ్ చేస్తూ ఖమ్మం జిల్లా తల్లాడ, కొణిజర్ల, మధిర మండలాల్లో శనివారం సిపిఎం నాయకులు ఆందోళన చేపట్టారు. కొణిజర్ల మండలం పెద్దగోపతిలో కొనుగోలు కేంద్రంలో రైతులతో కలిసి సిపిఎం నాయకులు నిరసన తెలిపారు. సిపిఎం వైరా డివిజన్ కార్యదర్శి భూక్య వీరభద్రం రైతుల సమస్యలు తెలుసు కున్నారు. తల్లాడలో సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు బొంతు రాంబాబు కొనుగోలు కేంద్రాన్ని సందర్శించి రైతుల ఇబ్బందులు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ధాన్యం మార్కెట్‌కు తెచ్చి 15 నుంచి 20 రోజులు గడుస్తున్నా రైతులను పట్టించుకునే నాధుడే కరువయ్యారన్నారు. అధికారుల్లో జవాబుదారితనం లేదని, రాజకీయ పలుకుబడి ఉంటేనే కొనుగోలు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కేంద్రాల్లో కనీసం మంచినీటి సదుపాయం కూడా ఏర్పాటు చేయలేదన్నారు. వర్షం భయంతో అన్నదాతలు ఆవేదన చెందుతున్నారని అన్నారు. తేమ పేరుతో ఐదు నుంచి పది కిలోల వరకు తరుగు తీయడంతో రైతులకు తీవ్ర నష్టం జరుగుతుందని అన్నారు. ప్రభుత్వం, అధికారులు సహకారంతోనే దోపిడీ జరుగుతోందని తెలిపారు. తేమ శాతం ఉన్నా గన్నీ సంచులు సకాలం ఇవ్వకుండా, కాంటా వేసిన బస్తాలను లారీల్లో పంపకుండా కాలయాపన చేస్తున్నారని ఆరోపించారు. ఇప్పటికైనా వెంటనే కొనుగోళ్లు చేయాలని, లేకుంటే రైతులతో కలిసి ఆందోళనలు నిర్వహిస్తామని తెలిపారు. మధిర పట్టణంలో సిపిఎం డివిజన్ కార్యదర్శి మడుపల్లి గోపాలరావు తదితరులు స్థానిక మార్కెట్‌ను సందర్శించి రైతులతో మాట్లాడారు. మార్కెట్‌కు ధాన్యం తెచ్చి 15 రోజులు గడిచినా అధికారులు కొనుగోలు చేయడం లేదని రైతులు తమ ఆవేదన వెలుబుచ్చారు. దాంతో మార్కెట్ ఎదుట ప్రధాన రహదారిపై రైతులతో కలిసి సిపిఎం నాయ కులు బైటాయించి రాస్తారోకో చేపట్టారు. ట్రాఫిక్ స్తంభించడంతో పోలీసులు వచ్చి చర్చలు జరిపారు. మార్కెట్ కమిటీ ఛైర్మెన్ ఇచ్చిన హామీ మేరకు రాస్తారోకో విరమించారు.



ధాన్యంపై బైటాయించి నిరసన తెలుపుతున్న రైతులు, సిపిఎం నాయకులు

### శ్రీశైలం-హైదరాబాద్ జాతీయ రహదారిపై రైతుల ఆందోళన

రంగారెడ్డి జిల్లా ఆమనగల్ పట్టణంలో శనివారం సాయంత్రం ఈదురు గాలులతో కూడిన అకాల వర్షం అపార నష్టాన్ని మిగిల్చింది. స్థానిక మార్కెట్ యార్డులో రైతులు ఆరబెట్టిన వందల క్వింటాళ్ల వరి ధాన్యం తడిసి ముద్దయింది. ఆరుగాలం కష్టపడి పండించిన పంట వర్షార్పణం కావడంతో రైతులు బోరుమన్నారు. ప్రభుత్వం తమను ఆదుకోవాలని డిమాండ్ చేస్తూ మార్కెట్ యార్డు ఎదురుగా శ్రీశైలం-హైదరాబాద్ జాతీయ రహదారిపై ఆందోళన చేపట్టారు. ధాన్యం కొనుగోలులో జరుగుతున్న నిర్లక్ష్యం వల్లనే తమ పంట నీటి పాలైందని ఆవేదన వ్యక్తం చేశారు. అకాల వర్షంతో నష్టపోవడంతో ప్రభుత్వం ఆదుకోవాలని డిమాండ్ చేశారు.



## కర్ణాటక శాస్త్రీయ సంగీత నిధి త్యాగరాజ స్వామి

ప్రజాశక్తి కల్చరల్

కర్ణాటక శాస్త్రీయ సంగీతానికి దిశా నిర్దేశనం చేసిన వాగ్గేయకారులు త్యాగరాజ స్వామి అని రాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థ పూర్వ ఛైర్మన్ ఉప్పల శ్రీనివాస్ గుప్తా అన్నారు శ్రీ త్యాగరాయ గానసభలోని గుండవరపు హనుమంతరావు కళా వేదికపై గాన సభ నిర్వాహణలో జరుగుతున్న ఎందరో మహానుభావులు కార్యక్రమ పరంపరలో భాగంగా త్యాగరాజ స్వామి జయంతి వేడుకలు జరిగాయి. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఉప్పల శ్రీనివాస్ మాట్లాడుతూ అన్నమయ్య కీర్తనలు సాహిత్య ప్రధానం కాగా త్యాగరాజ కీర్తనలు సంగీతం పాళ్ళు ఎక్కువ అని వివరించారు రాజుల ఆశ్రయం చేరక బిక్షాటన చేస్తూ నిధి చాలా సుఖమా రాముని సన్నిధి చాలా సుఖమా అని శ్రీ రాముని నమ్ముకుని అపారమైన సంగీత సంపద జాతికి అందించిన త్యాగజీవి త్యాగరాజు అని నివాళి అర్పించారు గాన సభ అధ్యక్షుడు కళా జనార్ధన మూర్తి అధ్యక్షత వహించిన సభలో బి జె పి నాయకుడు వంశీ గాన సభ కార్యవర్గ సభ్యులు బండి శ్రీనివాస్ ద్రవిడ్ తదితరులు పాల్గొన్నారు